# భారత రాజ్యాంగం

## (సంక్షిప్త పరిచయం)

దళిత స్త్రీ శక్తి

# భారత రాజ్యాంగం

సంక్షిప్త పరిచయం

ప్రచురణ: దళిత స్త్రీ శక్తి

ప్రచురణ సంఖ్య : 53

ముద్రణ: ఫిబ్రవరి 2021

ప్రతులు : 1000

ప్రతులకు : దళిత స్త్రీ శక్తి
6-3-1216/47బి
రోడ్ నెం. 3, మెథడిస్ట్ కాలనీ, కుందన్‌బాగ్,
బేగంపేట్, హైదరాబాద్ - 500016
ఫోన్ : 9849451849
email : dss.dalitsthreesakthi@gmail.com
www.dalitsthreesakthi.com

ముద్రణ : అనుపమ ప్రింటర్స్
గ్రీన్ వ్యూ, 126, శాంతినగర్,
హైదరాబాద్ - 28
ఫోన్ : 040 23391364

# ముందు మాట

దళిత మహిళా కార్యకర్తలు, మహిళా కలయికల నాయకులు, సభ్యులు, యువత తమ తమ ప్రాంతాల్లో హక్కుల ఉల్లంఘన సంఘటనలను నిత్యం పర్యవేక్షిస్తుంటారు. వీరందరికీ వివిధ సమయాల్లో వివిధ ప్రత్యేక చట్టాల గురించి శిక్షణలిచ్చాము. మానవ హక్కులు, రాజ్యాంగ హక్కులపై అవగాహనను ఈ శిక్షణల ద్వారా కలిపించాం. అత్యంత అవసరమైన ప్రత్యేక చట్టం, షెడ్యూల్డు కులాల, తెగలపై అత్యాచారాల నిరోధక చట్టం అనువదించి కార్యకర్తలందరికి వేల ప్రతులను అందించి అందరికీ అందుబాటులోకి తెచ్చాం. రాజ్యాంగ హక్కుల గురించి శిక్షణ ఇచ్చినా, రాజ్యాంగం గురించి సంక్షిప్తంగా పరిచయం చేసే పుస్తకం అందుబాటులోనికి తెస్తే బాగుంటుందని ఈ పుస్తకాన్ని ప్రచురిస్తున్నాము. ఈ చిన్ని పుస్తకంలో రాజ్యాంగం అంటే ఏమిటి? రాజ్యాంగంలో పొందుపర్చిన వివిధ హక్కులేమిటి? రాజ్యాంగం మొత్తంలో వున్న వివిధ అంశాలు ఏమిటి ? అనే విషయాలు సంక్షిప్తంగా తెలియజేస్తున్నాము. ఏదైనా ఒక అంశంపై లోతుగా అధ్యయనం చెయ్యాలనుకున్నవారు రాజ్యాంగంపై వ్రాయబడిన గ్రంథాలను చదువుకోవచ్చు. ఈ పుస్తకం ద్వారా మన హక్కుల కార్యకర్తలందరికీ రాజ్యాంగంపై ఒక కనీస అవగాహన కల్పించాలన్నదే మా ఉద్దేశ్యం.

**ఝాన్సీ గెడ్డం**
జాతీయ కన్వీనర్
దళిత స్త్రీ శక్తి

# రాజ్యాంగం పాలనా వ్యవస్థను నిర్ధేశిస్తుంది

## ఫెడరల్ వ్యవస్థ

ప్రపంచ దేశాల్లో పాలనా వ్యవస్థలను రెండు రకాలుగా విభజించవచ్చు.

1. ఫెడరల్ వ్యవస్థ 2. కేంద్రీకృత వ్యవస్థ

ఒకే భాష, జాతి దేశాల్లో కేంద్రీకృత పరిపాలనా వ్యవస్థ వుంటుంది. ఉదా: ఇంగ్లండ్, జర్మనీ, ఫ్రాన్స్ తదితర దేశాలు. దీన్నే యూనిటరీ లేదా కేంద్రీకృత పాలనా వ్యవస్థ అంటారు. వివిధ భాషా జాతులు వున్న ప్రాంతంలో ఇవన్నీ కలిసి ఒక దేశంగా ఏర్పడిన సందర్భాల్లో ఫెడరల్ వ్యవస్థ లేదా కేంద్ర, రాష్ట్ర ఉమ్మడి పాలనా వ్యవస్థ అని అంటారు. అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా, భారత దేశాలలో ఇలాంటి ఫెడరల్ వ్యవస్థ వున్నది. ఫెడరల్ పాలనా వ్యవస్థ వుండే దేశాల్లో అధికారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా నడుపుతాయి. మన రాజ్యాంగం ఫెడరల్ వ్యవస్థను ఏర్పర్చింది. మనకు కేంద్ర ప్రభుత్వం వివిధ రాష్ట్రాల ప్రభుత్వాలు అధికారాన్ని పంచుకుంటాయి. ఎవరు ఏ అధికారాలు కలిగి వుంటారు అనేది మన రాజ్యాంగంలో వివరంగా చెప్పబడింది. రాజ్యాంగంలోని 7వ షెడ్యూల్లో 3 పట్టికలున్నాయి. అవి :

1. కేంద్ర పట్టిక (Union list)
2. రాష్ట్ర పట్టిక (State list)
3. ఉమ్మడి పట్టిక (Concurrent list)

ఈ పట్టికల్లో వ్యవసాయం, శాంతి భద్రతలు, వివిధ పన్నులు, గనులు, పరిశ్రమలు ఇలా కొన్ని వందల అంశాలను విభజించి చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారి వారి పట్టికలో వున్న అంశాలపై శాసన, పరిపాలన అధికారాలు కలిగివుంటాయి.

అయితే మన రాజ్యాంగంలో కేంద్రానికి విస్తృతమైన అధికారాలు కల్పించబడ్డాయి. రాష్ట్రాలకు కేటాయించబడిన అంశాలు కేంద్రంతో పోలిస్తే తక్కువ. అంతేకాక ఉమ్మడి పట్టికలోని అంశాలపై చట్టాలు చేసే అధికారంలో కేంద్రానిదే పై చేయి. ఇదికాక రకరకాల అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వాలపై కేంద్రానికి నిర్దేశించే అధికారాలు వున్నాయి. వీటన్నిటిరీత్యా మన రాజ్యాంగాన్ని రూపంలో ఫెడరల్ వ్యవస్థ కానీ, సారాంశంలో కేంద్రీకృత వ్యవస్థ అని కొందరు న్యాయ నిపుణులు అభివర్ణించారు (Quasi Federal). ఏదేమైనా మన దేశంలో భారత రాజ్యాంగం ప్రాథమిక చట్టం. అన్ని ఇతర చట్టాలు, వ్యవస్థలు రాజ్యాంగానికి లోబడి వుంటాయి.

## పార్లమెంటరీ ప్రజాస్వామ్యం

మన రాజ్యాంగం దేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పింది. కొన్ని దేశాల్లో అధ్యక్ష పాలనా వ్యవస్థ వుంటుంది. ఉదా: అమెరికాలో దేశ ప్రజానీకం అందరూ తమ ఓటు హక్కు వినియోగించి అధ్యక్షున్ని ఎన్నుకుంటారు. కానీ మన రాజ్యాంగం ప్రకారం భారతదేశంలో దేశాధ్యక్షున్ని (రాష్ట్రపతి) ప్రజలు నేరుగా ఎన్నుకోరు. పార్లమెంటు సభ్యులు, శాసనసభ సభ్యులు మాత్రమే రాష్ట్రపతి ఎన్నికలో పాలుపంచుకుంటారు. మన రాష్ట్రపతి పరిపాలక అధ్యక్షుడు. పరిపాలన ఉత్తర్వులు అన్ని రాష్ట్రపతి పేరులోనే వస్తాయి. అలాగే పార్లమెంటు చేసే చట్టాలు రాష్ట్రపతి ఆమోదం తర్వాతనే చట్టాలవుతాయి.

పార్లమెంటరీ వ్యవస్థలో లోక్‌సభలో మెజారిటీ వున్న వ్యక్తిని ప్రధానమంత్రిగా, ఆయన సూచనమేరకు ఇతర మంత్రుల్ని నియమిస్తారు. ప్రధానమంత్రి అతని ఆధ్వర్యంలో మంత్రివర్గం లోక్‌సభలో మెజారిటీ సభ్యుల మద్దతు వున్నంత కాలం మాత్రమే అధికారంలో కొనసాగుతారు. మెజారిటీ సభ్యుల మద్దతు కోల్పోయినపుడు మంత్రివర్గం రద్దవుతుంది. రాష్ట్రాల్లో కూడా మెజారిటీ శాసన సభ్యుల మద్దతు కలిగిన వ్యక్తే ముఖ్యమంత్రిగా నియమించబడతారు. అతని సూచన మేరకు మంత్రివర్గం ఏర్పడుతుంది. కేంద్రంలో రాష్ట్రపతి లాగానే రాష్ట్రాల్లో ఈ నియామకాలు గవర్నర్ ఆధ్వర్యంలో జరుగుతాయి. రాష్ట్ర పాలనా ఉత్తర్వులన్నీ గవర్నర్ పేరున జరుగుతాయి.

## స్వతంత్ర న్యాయ వ్యవస్థ

భారత రాజ్యాంగం ప్రకారం మన న్యాయ వ్యవస్థ స్వతంత్రమైనది. శాసన వ్యవస్థకు గానీ, పరిపాలక వ్యవస్థకు గానీ, న్యాయ వ్యవస్థను నియంత్రించే అధికారం లేదు. న్యాయ వ్యవస్థ రాజ్యాంగాన్ని విశ్లేషించి, తగు భాష్యం చెప్పే అధికారం కలిగి వుంటుంది. రాష్ట్రాల మధ్య లేదా రాష్ట్రానికి కేంద్రానికి మధ్య అధికారాలకు సంబంధించి వివాదం ఏర్పడితే వాటిపై తీర్పు చెప్పే అధికారం న్యాయ వ్యవస్థకు వుంటుంది. అదే విధంగా పార్లమెంటు లేదా రాష్ట్ర శాసన సభ ఏదైనా చట్టం చేసినపుడు ఆ చట్టం రాజ్యాంగానికి లోబడి వుందా లేదా అతిక్రమించిందా అనే నిర్ణయం న్యాయ వ్యవస్థ చేస్తుంది. న్యాయ వ్యవస్థ క్రింది మెజిస్ట్రేట్ స్థాయి నుంచి సుప్రీంకోర్టు వరకు విస్తరించి వుంది. రాష్ట్రాల్లో హైకోర్టులు తమ క్రింది కోర్టులపై అధికారం కలిగి వుంటాయి. అన్ని రాష్ట్రాల్లో హైకోర్టుల పైన సుప్రీంకోర్టు అధికారం కలిగి ఉంటుంది. సుప్రీంకోర్టు తీర్పులు చట్టంతో సమానం. ఆ తీర్పుల్ని భారతదేశంలోని అన్ని కోర్టులు పాటించాలని రాజ్యాంగంలోని 141వ అధికరణం నిర్ధేశిస్తుంది.

### రాజ్యాంగ నిర్మాణం :

రాజ్యాంగం ఈ విధంగా విభజింపబడి వుంది. 22 భాగాలు 395 అధికరణాలు (వరుస ప్రకారం 395 కానీ, వివిధ సవరణల ద్వారా ఎన్నో అధికరణాలు మధ్యలో జొప్పించబడినాయి. అన్నిటినీ కలిపి లెక్కిస్తే మొత్తం అధికరణాలు 400 పై చిలుకే వుంటాయి).

12 అనుబంధాలు (Schedules)

2 సూచన పట్టికలు (Appendix)

### భాగాలు :

ఒకే అంశానికి సంబంధించిన అధికరణాలన్నిటినీ కలిపి ఒక్కొక్క భాగంలో పొందుపర్చి రాజ్యాంగాన్ని 22 భాగాలుగా విభజించారు.

## ఉపోద్ఘాతం

| | | |
|---|---|---|
| భాగం I | – | దేశం మరియు దేశంలోని ప్రాంతాలు |
| భాగం II | – | పౌరసత్వం |
| భాగం III | – | ప్రాథమిక హక్కులు |
| భాగం IV | – | ఆదేశిక సూత్రాలు |
| భాగం IV A | – | ప్రాథమిక విధులు |
| భాగం V | – | కేంద్రం |
| భాగం VI | – | రాష్ట్రాలు |
| భాగంVII | – | B ప్రాంతపు రాష్ట్రాలు (ఈ భాగం తొలగించబడింది) |
| భాగంVIII | – | కేంద్రపాలిత రాష్ట్రాలు |
| భాగం IX | – | పంచాయితీ వ్యవస్థ |
| భాగం IX A | – | మున్సిపాలిటీ వ్యవస్థ |
| భాగం IX B | – | కోపరేటివ్ సంఘాలు |
| భాగం X | – | షెడ్యూల్డు మరియు గిరిజన ప్రాంతాలు |
| భాగం XI | – | కేంద్ర, రాష్ట్ర సంబంధాలు |
| భాగం XII | – | ఆర్థికం, ఆస్తులు, కాంట్రాక్టులు మరియు దావాలు |
| భాగం XIII | – | భారతదేశ పరిధిలో వ్యాపారం మరియు వాణిజ్యం |
| భాగం XIV | – | కేంద్ర, రాష్ట్రాల క్రింద ఉద్యోగులు |
| భాగం XIV A | – | ట్రిబ్యునళ్ళు |
| భాగం XV | – | ఎన్నికలు |
| భాగం XVI | – | కొన్ని తరగతుల ప్రజలకు సంబంధించి ప్రత్యేక అధికరణాలు |
| భాగం XVII | – | భాషలు |
| భాగం XVIII | – | అత్యవసర పరిస్థితికి సంబంధించిన అధికరణాలు |
| భాగం XIX | – | ఇతరములు |
| భాగం XX | – | రాజ్యాంగ సవరణ విధానం |

భాగం XXI – తాత్కాలిక, మార్పుకు సంబంధించిన మరియు ఇతర ప్రత్యేక అధికరణాలు

భాగం XXII – రాజ్యాంగం పేరు, అమల్లోనికి వచ్చే తేదీ, హిందీ భాషలో అధికారిక ప్రచురణ, మరియు రద్దు చేయబడిన చట్టాలు

**అనుబంధాలు (Schedules)**

రాజ్యాంగానికి అనుబంధంగా వున్న షెడ్యూల్లో పరిపాలనకు సంబంధించి ప్రభుత్వ విధానాలకు సంబంధించిన అంశాలు పేర్కొనబడ్డాయి.

**మొదటి అనుబంధం :** ఇది ఒకటి నుండి నాలుకు వరకు అధికరణాలకు సంబంధించినది. దేశంలోని రాష్ట్రాలు వాటి భూ భాగాలు, అందులో జరిగిన మార్పులు, సంబందిత చట్టాల గురించి ఈ అనుబంధంలో వున్నాయి.

**రెండవ అనుబంధం :** అధికరణాలు 59, 65, 75, 97, 125, 148, 158, 164, 186 మరియు 221. ఈ అధికరణాలకు సంబంధించి ప్రభుత్వ అధికారుల, న్యాయమూర్తుల మరియు భారతదేశ ఆడిటర్ జనరల్ తదితరుల జీతాల గురించి ఈ అనుబంధంలో పేర్కొనబడింది.

**మూడవ అనుబంధం :** అధికరణం 75, 99, 124, 148, 164, 188 మరియు 219. న్యాయమూర్తులు మరియు ఇతర ఎన్నిక కాబడిన ప్రతినిధులు తదితరులు చేయవలసిన ప్రమాణ పత్రాలు ఈ అనుబంధంలో వున్నాయి.

**నాలుగవ అనుబంధం :** అధికరణం 4 మరియు 80. రాష్ట్రాల్లో, కేంద్రపాలిత ప్రాంతాల నుండి రాజ్య సభకు ఎవరికి, ఎంతమంది ప్రతినిధులు వుంటారో ఈ అనుబంధంలో పేర్కొన్నారు.

**అయిదవ అనుబంధం :** అధికరణం 244. షెడ్యూల్డు తెగల, ప్రాంతాల పరిపాలనకు సంబంధించిన అంశాలు ఈ అనుబంధంలో వున్నాయి.

**ఆరవ అనుబంధం :** అధికరణం 244 మరియు 275. అస్సాం, మేఘాలయ, త్రిపుర మరియు మిజోరాం రాష్ట్రాల్లోని ఆదివాసీ ప్రాంతాల పాలనకు సంబంధించిన అంశాలు ఈ అనుబంధంలో వున్నాయి.

**ఏడవ అనుబంధం :** అధికరణం 246. కేంద్ర, రాష్ట్ర మరియు ఉమ్మడి అధికారాల పట్టికలు.

**ఎనిమిదవ అనుబంధం :** అధికరణం 344 మరియు 351. అధికార భాషలు.

**తొమ్మిదవ అనుబంధం :** అధికరణం 31 B. ఈ అనుబంధంలో చేర్చబడిన చట్టాలు ఏ కోర్టుల్లోనూ సవాలు చేయడానికి వీల్లేదు.

**పదవ అనుబంధం :** అధికరణం 102 మరియు 191. పార్లమెంటు మరియు శాసన సభ సభ్యుల ఫిరాయింపు నిరోధక చట్టంకు సంబందించిన అంశాలు.

**పదకొండవ అనుబంధం :** అధికరణం 243 G. పంచాయితీ రాజ్ వ్యవస్థ.

**పన్నెండవ అనుబంధం :** అధికరణం 243 W. మున్సిపాలిటీలు.

# భారతదేశం - దేశ పౌరులు

**భాగం I – దేశం మరియు దేశ భూభాగం – అధికరణాలు (1–4).**

ఈ అధికరణాల్లో భారతదేశం భూభాగంలోని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల గురించి చెప్పబడింది. "ఇండియా, అనగా భారతదేశం వివిధ రాష్ట్రాల కలయిక" అని ప్రకటించబడింది.

భారతదేశంలో రాష్ట్రాలకు, వాటి పేర్లను, భూభాగాలను మారుస్తూ పార్లమెంటు చట్టం చేయవచ్చుని, ఈ అధికరణాలు నిర్ధేశిస్తున్నాయి. పార్లమెంటులో సాధారణ మెజారిటీతో రాష్ట్రాలను ఏర్పాటు చేయడం లేదా వాటి భూభాగాలను మార్చడం చేసే అధికారం పార్లమెంటుకు కలదు. కానీ, ఈ అధికారాలను ప్రత్యేక సందర్భాలలో మాత్రమే ఉపయోగించారు. ప్రస్తుతం భారతదేశంలో 28 రాష్ట్రాలు మరియు 7 కేంద్రపాలిత ప్రాంతాలు మనుగడలో వున్నాయి. ఈ అధికారణాలు భారతదేశపు ఫెడరల్ వ్యవస్థను నిర్ధేశించేవి కనుక ఇవి రాజ్యాంగ మౌలిక నిర్మాణంలో భాగం అనీ, వీటిని సవరించే అధికారం పార్లమెంటుకు లేదని కోర్టు తీర్పు చెప్పింది. 1975లో సిక్కింని భారత దేశంలో చేర్చుకుంటూ ఈ అధికరణల కింద చట్టం చేశారు. అదేవిధంగా 2014 లో తెలంగాణా రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తూ ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణ చట్టం వచ్చింది.

**భాగం II – పౌరసత్వం – అధికరణాలు (5 –11)**

పౌర సత్వానికి సంబంధించి రాజ్యాంగంలో మొత్తం 7 అధికరణాలున్నాయి.

అవి :

**అధికరణం 5** : రాజ్యాంగం అమల్లోనికి వచ్చే సరికి పౌరసత్వంకు సంబంధించి

**అధికరణం 6** : పాకిస్థాన్ నుండి భారతదేశానికి వలస వచ్చిన వ్యక్తుల పౌరసత్వం గురించి

**అధికరణం 7** : పాకిస్థాన్‌కు వలస వెళ్ళిన కొంతమంది పౌరసత్వ హక్కుల గురించి

**అధికరణం 8** : భారతదేశ వ్యక్తులయ్యుండి, ఇతర దేశాల్లో నివసిస్తున్న వారి పౌరసత్వం గురించి

**అధికరణం 9** : స్వచ్ఛందంగా ఇతర దేశాల పౌరసత్వం తీసుకున్న భారతీయులు ఈ దేశ పౌరులు కారు.

**అధికరణం 10** : పౌరసత్వపు హక్కు కొనసాగింపు గురించి

**అధికరణం 11:** పౌరసత్వ హక్కును నిర్వచిస్తూ చట్టం చేసే అధికారం పార్లమెంటుకు కల్పించబడింది.

అధికరణం 11 క్రింద కల్పించబడిన అధికారాన్ని ఉపయోగించి పార్లమెంటు పౌరసత్వ చట్టం 1955ను చేసింది. తరువాత ఈ చట్టాన్ని వివిధ సందర్భాల్లో సవరించారు. భారతదేశ పౌరులకు ఈ దేశ పౌరసత్వం మాత్రమే వుంటుంది. ఎవరైనా వేరే దేశపు పౌర సత్వం తీసుకుంటే వారికి ఈ దేశ పౌరసత్వం రద్దవుతుంది. కానీ 2003లో చేసిన సవరణ చట్టం ద్వారా మన దేశ పౌరులు ఆ చట్టంలో చెప్పబడిన 16 ఇతర దేశాల పౌరసత్వాన్ని కూడా కలిగి వుండవచ్చు.

ఈ పౌరసత్వ చట్టం 1986లో, 1992, 2003, 2005, 2019 లలో సవరణలకు గురయ్యింది. 2019లో చేసిన సవరణల చట్టం వివాదాలకు దారితీసింది.

# ప్రాథమిక హక్కులు - ఆదేశిక సూత్రాలు

**భాగం III – ప్రాథమిక హక్కులు – అధికరణం (12–35)**

భారత రాజ్యాంగం మూడవ భాగం అత్యంత ప్రాముఖ్యమైనది. ప్రజలందరి ప్రాథమిక హక్కులు ఈ భాగంలోనే ఉన్నాయి. రాజ్య వ్యవస్థ ప్రాథమిక హక్కులు ఉల్లంఘించినప్పుడు వాటి పరిరక్షణకై మనం కోర్టులకు వెళ్ళి ఉల్లంఘనను సరిచేసుకోవచ్చు. అధికరణం 12లో రాజ్యం దాని విభాగాలను వివరించారు. ప్రాథమిక హక్కులు రాజ్యాంగ సవరణ ద్వారా తొలగించటం వీలు కాదు అనీ, ఇవి రాజ్యాంగ మౌలిక నిర్మాణంలో భాగం అనీ సుప్రీంకోర్టు కేశవానంద భారతి కేసులో తీర్పునిచ్చింది. కాని ప్రాథమిక హక్కులపై కూడ కొన్ని నియమాలను పెట్టవచ్చు. అదేవిధంగా అత్యవసర పరిస్థితి ప్రకటించినప్పుడు కొన్ని హక్కులను తాత్కాలికంగా తీసివేయవచ్చు. ప్రాథమిక హక్కులను ఈ క్రింది ఆరు హక్కులుగ విభజించవచ్చు.

1. సమానత్వ హక్కు (అధికరణం 14–18)
2. స్వేచ్ఛ హక్కులు (అధికరణం 19–22)
3. దోపిడీ వ్యతిరేక హక్కు (అధికరణం 23–24)
4. మత స్వేచ్ఛ (అధికరణం 25–28)
5. సాంస్కృతిక మరియు విద్య హక్కులు (అధికరణం 29–30)
6. హక్కుల ఉల్లంఘనకు రాజ్యాంగ నివారణలు (అధికరణం 32)

**1. సమానత్వ హక్కు (అధికరణం 14–18)**

- చట్టం ముందు సమానత్వం మరియు చట్టంచే సమానత్వ రక్షణ (అధికరణం 14)
- దుకాణాలు, హోటళ్ళు, బావులు, చెరువులు, స్నానం చేసే ప్రాంతాలు, రహదారులు తదితర సదుపాయాలను వినియోగించుకునేందుకు అందరికీ

సమాన అవకాశాలు ఉంటాయి. మతం, జాతి, కులం, లింగ మరియు పుట్టిన ప్రాంతం ఆధారంగా వీటిని వినియోగించుకోవటంలో వివక్షకు గురి చేయకూడదు (అధికరణం 15)

- ప్రభుత్వ ఉపాధి పొందేందుకు అందరికీ సమాన అవకాశాలు ఉండాలి (అధికరణం 16)
- అంటరానితనం రద్దు చేయబడింది, అది పాటించటం శిక్షార్హమైన నేరం (అధికరణం 17)
- వ్యక్తులకు బిరుదు ఇవ్వటం లేదా వాడటం రద్దు చేయబడింది (అధికరణం 18)

సమానత్వ హక్కు అన్ని అంశాలలో ప్రజల మధ్య సమానత్వం ఉండాలని సూచిస్తుంది. ఇతర దేశాలలో చట్టం ముందు సమానత్వం, చట్టాల రక్షణ అందరికీ సమానంగా వర్తించాలని ఉంటుంది. ఇంతకుమించి సమానత్వపు ఇతర అంశాలు ఇతర దేశాలలో అవసరం కాలేదు. కానీ మన దేశంలో కుల వివక్ష, అంటరానితనం ఎన్నో యేళ్ళుగా అమలవుతున్న కారణంగా సమానత్వపు హక్కు ఐదు అధికరణాల ద్వారా పొందుపరిచారు. బహిరంగ ప్రాంతాల్లో తిరగటం, హోటళ్ళు, దేవాలయాలు, చెరువులు, వినియోగించుకోవటంలో షెడ్యూల్డు కులాల వారిపై గతంలో వివక్ష అమలు అయ్యేది. అందుకై ఆ వివక్షను తొలగిస్తు అధికరణం 15 ఈ అంశాలలో సమానత్వాన్ని కల్పిస్తున్నది. అదేవిధంగా ప్రభుత్వ ఉద్యోగాలలో వివక్ష లేకుండ అందరికి సమాన అవకాశాలు ఉండాలని అధికరణం 16 నిర్దేశిస్తుంది. అదేవిధంగా గతంలో అమలు అవుతున్న అంటరానితనాన్ని అధికరణం 17 నిషేధించటమేకాక అది పాటించటం శిక్షార్హమైన నేరం అని ప్రకటించింది. అధికరణం 17 అనుగుణంగా అంటరాని తనాన్ని నిషేధిస్తూ చట్టాలు వచ్చాయి. గతంలో కొంతమందికి బిరుదులు ఉండేవి. ఆ బిరుదులు గలవారు గొప్పవారని లేనివారు తక్కువ వారు అని వివక్ష ఉండేది. కాని రాజ్యాంగం అమలులోకి వచ్చిన తరువాత అటువంటి బిరుదులన్ని రద్దు చేయబడ్డాయి. కాని ఇప్పుడు కూడ సైనిక సేవలలో, కళలు, సామాజిక సేవల్లో

ప్రతిభ కలవారికి పద్మశ్రీ, పద్మభూషన్, పరమవీర చక్ర లాంటి అవార్డులు ప్రభుత్వం ప్రకటిస్తుంది. ఇవి వారి సేవలు, ప్రతిభకు గుర్తింపు మాత్రమే. ఇవి బిరుదులు కావు వీటిని అవార్డులు అంటారు.

సమానత్వపు హక్కు గురించి ఇన్ని అధికరణలు ఉన్నా నిజమైన సమానత్వం మన సమాజంలో వీలు కాదు. ఎన్నో తరాలుగా అణచివేతకు గురై సామాజికంగా, విద్యపరంగా వెనుకబడిన వర్గాలవారు, మహిళలు, పిల్లలు అందరితో సమానంగా పోటీలో నిలువలేరు. అటువంటి వెనుకబడిన వర్గాలవారికి ఉద్యోగ అవకాశాల్లో మరియు విద్య సంస్థల్లో ప్రవేశాల్లో ప్రత్యేక రాయితీలు కల్పించినప్పుడే వారికి అవకాశాలు ఏర్పడతాయి. అప్పుడే నిజమైన సమానత్వం వీలుపడుతుంది. దీనిని రక్షణతో కూడిన వివక్ష (Protective Discrimination) అని అంటారు. ఇటువంటి రక్షణ ద్వారా మహిళలకు, షెడ్యూల్డ్ కులాలకు, తెగలకు వెనుకబడిన కులాలవారికి రిజర్వేషన్ సౌకర్యం కల్పించబడింది. అధికరణం 15,16 లలో ఈ హక్కు కల్పించబడింది.

**2. స్వేచ్ఛ హక్కులు (అధికరణం 19-22)**

- భావ ప్రకటనా స్వేచ్ఛ (అధికరణం 19(1)(a))
- శాంతియుతంగ సమూహంగా ఏర్పడటం (అధికరణం 19 (1) (b) )
- సంఘాలు, యూనియన్‌లు ఏర్పరుచుకోవటం (అధికరణం 19 (1) (c))
- భారత దేశం అంతటా స్వేచ్ఛగా తిరగటం (అధికరణం 19 (1) (d) )
- భారతదేశంలో ఎక్కడైనా నివాసం ఏర్పరచుకుని స్థిరపడటం (అధికరణం 19(1) (e) )
- ఆస్తిని సంపాదించుకునే హక్కు అధికరణం (19(1) (f) ) గతంలో ఉండేది కాని అది రద్దు చేయబడింది.
- ఏ వృత్తినైనా, ఉపాధినైనా వర్తకం, వ్యాపారం చేసుకునే హక్కు (అధికరణం 19 (1) (g) )

- నిందితుడికి ఉండే హక్కులు – (అధికరణం 20)
- వ్యక్తి స్వేచ్ఛ, జీవించే హక్కు (అధికరణం 21)
- విద్య హక్కు – (అధికరణం 21 A)
- నిర్బంధానికి సంబంధించిన పద్ధతి హక్కులు (అధికరణం 22)

ప్రజలందరికీ సమానత్వం, స్వేచ్ఛ ప్రధాన హక్కులు. స్వేచ్ఛ అంటే చాలా విస్తృతమైనది. స్వేచ్ఛ ఎన్నో రకాలుగా ఉంటుంది. భావ ప్రకటన మొదలుకొని వ్యక్తి చేసే ఎన్నో రకాల పనులకు స్వేచ్ఛ ఉండాలి. అయితే స్వేచ్ఛ అసలు నియంత్రణ లేకుండా ఉండటం వీలు కాదు. ఒకరి స్వేచ్ఛ మరొకరి జీవన విధానానికి లేదా శాంతి భద్రతలకు భంగం కలిగించకూడదు.

అందుకోసం కొన్ని సహేతుకమైన నియంత్రణలతో వివిధ స్వేచ్ఛలు కల్పించబడ్డాయి. భావ ప్రకటనా స్వేచ్ఛ వుంది కదా అని ఇతరులను కించపర్చడం, శాంతి భద్రతలకు భంగం వాటిల్లే విధంగా ఉపన్యాసాలివ్వడం, నైతికతను భంగపర్చే విధంగా ప్రవర్తించడం లాంటి పనులు చేయకూడదు. శాంతియుతంగా ఒక సమూహంగా ఏర్పడి ప్రభుత్వ నిర్ణయాలు, విధానాల పట్ల నిరసన వ్యక్తం చేయడం ఒక ప్రాథమిక హక్కు. కానీ, ప్రభుత్వం కొన్ని ప్రాంతాల్లో 5 కంటే ఎక్కువమంది వ్యక్తులు గుమిగూడడం చట్ట విరుద్ధమని ప్రకటించి, ఈ నిరసన హక్కును కాలరాసే దానికి అవకాశముంది. ఇలా హక్కులపై నియంత్రణ పేరుతో హక్కుల్ని హరించే అవకాశముంది. అందుకే ప్రజలు చైతన్యయుతంగా, అప్రమత్తంగా వుండి హక్కుల్ని కాపాడుకోవాలి.

**నిందితుల హక్కులు :**

ప్రజాస్వామ్య న్యాయ వ్యవస్థకు పూర్వకాలం ఎవరిపైన అయినా నేరారోపణ చేస్తే వారికి ఎటువంటి హక్కులు వుండేవి కాదు. ఒక వ్యక్తిపై నేరారోపణ చేసి అతనిని నేరం చేసినట్టు ఒప్పుకోమని చిత్రహింసలకు గురిచేసేవారు. ఈ పద్ధతి అన్ని దేశాల్లో చట్ట ప్రకారమే జరిగేది. ప్రజాస్వామ్య యుగంలో మానవ హక్కుల నేపథ్యంలో

నిందితులకు హక్కులు కల్పించబడ్డాయి. ఏ వ్యక్తి పైన అయినా నేరారోపణ చేసినప్పుడు అతనిని నేరం ఒప్పుకోమని, తనకి వ్యతిరేకంగా, తననే సాక్ష్యం ఇవ్వమని బలవంతం చెయ్యరాదు. అదే విధంగా ఎవరిపైన అయినా నేరారోపణ చేసినపుడు అతను చేసినపని నేరంగా ప్రకటించబడివుండాలి. ఏ వ్యక్తినీ అతను గతంలో చేసిన పనులను, ఆ తర్వాత నేరంగా ప్రకటించకూడదు. అదేవిధంగా ఒక వ్యక్తి చేసిన పనికి రెండుసార్లు శిక్ష విధించకూడదు. ఇలాంటి హక్కులన్నీ అంతర్జాతీయ మానవ హక్కులు. ఇవి అధికరణం 20 లో పొందుపరచబడ్డాయి.

## జీవించే హక్కు :

అధికరణం 21 ప్రకారం ఏ వ్యక్తి యొక్క జీవితాన్ని కానీ, వ్యక్తి స్వేచ్ఛను కానీ, చట్టం నిర్దేశించిన పద్ధతిలో మినహా ఇతరత్రా తీయరాదు. అంటే పార్లమెంటు లేదా శాసన సభలు వ్యక్తి స్వేచ్ఛను హరించే చట్టాలను చేసి ఆ చట్టాలకు అనుగుణంగా వ్యక్తి స్వేచ్ఛను హరించవచ్చా? ఆ చట్టాలు హేతుబద్ధంగా లేకపోయినా నిరంకుశ చట్టమైనా వ్యక్తి స్వేచ్ఛను అటువంటి చట్టాలకు అనుగుణంగా తీసివేయవచ్చా? దీనిపై ఎంతో చర్చ జరిగింది. ఎమర్జెన్సీ కాలంలో మీసా చట్టం అనుగుణంగా ఎంతోమందిని నిర్బంధించారు. అప్పుడు 'మీసా చట్టం' సహేతుకమైనది కాదని, అలాంటి చట్టం చెల్లదనీ నిర్బంధానికి గురైనవారు వాదించారు. కానీ ఆనాడు సుప్రీంకోర్టు ఎలాంటి చట్టమైనా, ఆ చట్టం సహేతుకంగా లేకపోయినా, చట్టం నిర్ధేశించిన పద్ధతిలో వ్యక్తి స్వేచ్ఛను హరించవచ్చని హెబియస్ కార్పస్ కేసులో తీర్పు చెప్పింది. ఆ తర్వాత ఎంతో చర్చ తర్వాత హెబియస్ కార్పస్ కేసును కొట్టి వేస్తూ మేనకా గాంధీ కేసులో తీర్పువచ్చింది. ఈ తీర్పు ప్రకారం వ్యక్తి స్వేచ్ఛను హరించే చట్టం ఏదైనా న్యాయమైనది, సహేతుకమైనది అయ్యి వుండాలి. ఆ తర్వాత వచ్చిన అనేక తీర్పుల ప్రకారం అధికరణం 21 లోని వ్యక్తి స్వేచ్ఛకు విస్తృతమైనటువంటి అర్థం కల్పించబడింది. ఇప్పుడు విదేశాలకు వెళ్ళడం, ఉచిత న్యాయ సహాయం, వ్యక్తిగత గోప్యత, జైళ్ళల్లో శిక్ష పడినవారికి రకరకాల హక్కులు, ఇలా ఎన్నో రకాల హక్కులు అధికరణం 21 కిందికి వస్తాయని అటువంటి హక్కులను అన్నింటినీ కాపాడాలనీ సుప్రీంకోర్టు తీర్పులు వచ్చాయి.

## నిందితుల హక్కులు మరియు ముందస్తు నిర్బంధం :

అధికరణం 22లో ఎవరినయినా, ఏ కారణంగానయినా అరెస్టు చేసినపుడు పాటించాల్సిన నిబంధనలను వివరిస్తుంది. అరెస్టయ్యే వ్యక్తికి వుండే హక్కులు ఈ అధికరణంలో పొందుపర్చబడ్డాయి. ఏ వ్యక్తినయినా అరెస్టు చేసినపుడు అతని అరెస్టు కారణాలు తెలియచేయాలి. అదేవిధంగా అతనికి తను కోరుకున్న న్యాయవాదిని సంప్రదించే హక్కు వుంటుంది. ఏ వ్యక్తిని అరెస్టు చేసినా అతన్ని 24 గంటల్లోపల న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చాలి. 24 గంటలు దాటి పోలీసులు ఏ వ్యక్తినయినా తమ కస్టడీలో వుంచుకంటే అది నేరమౌతుంది. అంటే పోలీసులు అరెస్టు చేసిన వ్యక్తిని తమ కస్టడీలో లేకుండానే నేర విచారణ చేసుకోవాలి. పోలీసులు అరెస్టు చేసి తమ నిర్బంధంలో వుంచుకున్నప్పుడు దాన్ని పోలీసు కస్టడీ అంటారు. న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచినపుడు న్యాయమూర్తి ఆ నిందితున్ని జైలుకు రిమాండ్ చేస్తారు. అలా జైలు కస్టడీని జ్యూడీషియల్ కస్టడీ అంటారు. జైల్లో వున్న నిందితున్ని పోలీసులు హింసలకు గురి చేయలేరు.

రాజ్యాంగంలో ఈ అధికరణంలో చెప్పబడిన హక్కులేకాక, సుప్రీంకోర్టు తన తీర్పుల ద్వారా అరెస్టు ఎలా చేయాలో, పాటించాల్సిన నిబంధనలు వివరంగా చెప్పింది. ఆ తీర్పుల్లో డి.కె. బాసు vs స్టేట్ ఆఫ్ వెస్ట్ బెంగాల్ అనే తీర్పు ఎంతో ముఖ్యమైనది. ఈ తీర్పు ద్వారా అరెస్టయిన నిందితునికి ఎన్నోహక్కులు, రక్షణ కల్పించబడ్డాయి.

అరెస్టుకు సంబంధించి అనవసరపు అరెస్టులు జరుగుతున్నాయని, చాలా సందర్భాల్లో అరెస్టు అవసరం లేదని పోలీసు కమీషన్, లా కమీషన్ రిపోర్టులు ఘోషిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇటీవల కాలంలో అరెస్టుకు సంబంధించిన సెక్షన్లు మార్చబడ్డాయి. నేర విచారణ స్మృతిలో పోలీసుల అరెస్టు అధికారాలు మార్చివేయబడ్డాయి. ఇప్పుడు మారిన చట్టం ప్రకారం అనవసరపు అరెస్టులు చేయడానికి లేదు. వ్రాత పూర్వకమైన కారణాలు తెలిపి అత్యవసరమైనపుడు మాత్రమే అరెస్టు చేయాలి.

**ముందస్తు నిర్బంధం :** పైన చెప్పుకున్న హక్కులన్నీ ఎవరైనా వ్యక్తిని ముందస్తు నిర్బంధ చట్టాల క్రింద అరెస్టు చేసినప్పుడు వర్తించవు. ముందస్తు నిర్బంధం కింద

ఏ వ్యక్తినయినా మూడు నెలల కంటే మించి నిర్బంధంలో వుంచకూడదు. మూడు నెలలకు మించి నిర్బంధం కొనసాగించాలంటే సలహా బోర్డు ముందు ఆ వ్యక్తి నిర్బంధం గురించిన పూర్తి వివరాలు అందచేసి, ఆ సలహా మండలి ఆమోదిస్తేనే, నిర్బంధం కొనసాగించాలి. ముందస్తు నిర్బంధ చట్టాలు ఒక వ్యక్తిని విచారణ, బెయిలు లాంటి అవకాశాలు లేకుండా నిర్బంధించేందుకు వీలు కల్పిస్తున్నాయి. ఇవి వ్యక్తి స్వేచ్ఛకు ఎంతో భంగం కలిగిస్తాయి. ఇవి జాతి విద్రోహులకు, టెర్రరిస్టు అనుమానితులకు, స్మగ్లర్లు, మాదక ద్రవ్యాలు రవాణా చేసేవారి లాంటి వారి కోసం ఉద్దేశించబడినవి. కానీ, వివిధ సందర్భాల్లో ప్రభుత్వం, రాజకీయ కక్ష సాధింపుగా ప్రజా సంఘాల నాయకులను, వామపక్ష వాదులను, ముందస్తు నిర్బంధ చట్టాల క్రింద అరెస్టు చేసింది.

### 3. దోపిడీ వ్యతిరేక హక్కు - అధికరణం 23 :

మనుషుల్ని వెట్టిచాకిరీకి, నిర్బంధ పనులకు వాడుకోవడాన్ని ఈ అధికరణం నిషేధిస్తుంది. అదేవిధంగా మనుషుల్ని అక్రమ రవాణా చేయడం, బాలల్ని ప్రమాదకరమైన వృత్తుల్లో పని చేయించడం కూడా ఈ అధికరణం క్రింద నిషేధించబడింది.

మన దేశంలో కుల వ్యవస్థ, భూస్వామ్య వ్యవస్థ కింద లక్షలాది ప్రజలు అణచివేయబడి వెట్టి చాకిరీకి గురయ్యారు. అదే విధంగా పాలేరు వ్యవస్థలాంటి బలవంతపు పని విధానం చాలాకాలం అమలయ్యింది. సమానత్వం సాధించడంలో భాగంగా ఈ అనాగరిక నిర్బంధ పని విధానాన్ని రాజ్యాంగం నిషేధించింది. అదేవిధంగా మనుషుల్ని వెట్టిచాకిరీకోసం అమ్మడం, కొనడం లాంటి పద్ధతి కూడా గతంలో వుండేది. దీన్ని కూడా ఈ అధికరణం నిషేధిస్తుంది. భూస్వాములు, వడ్డీ వ్యాపారస్తులు, తదితర దోపిడీ వర్గాల వారు ప్రజలను పీడించకుండా ఈ అధికరణం హక్కు కల్పిస్తుంది. అయినప్పటికీ, నేటికీ కొన్ని రంగాల్లో వెట్టిచాకిరీ కొనసాగుతుంది. దీనిపై కొన్ని స్వచ్ఛంద సంస్థలు, ప్రజా ప్రయోజన వ్యాజ్యం ద్వారా సుప్రీంకోర్టు దృష్టికి తీసుకువెళ్ళి ఎంతోమందికి విముక్తి కల్పించారు. ఈ అధికరణం కింద 14 సం॥ల లోపు బాలల్ని

ప్రమాదకరమైన వృత్తుల్లో, పరిశ్రమల్లో, గనుల్లో నియమించుకుని వారి శ్రమను దోపిడీ చేసే విధానం నిషేధించబడింది. ఇపుడు విద్యా హక్కు కూడా ప్రాథమిక హక్కుగా చేర్చబడడంతో బాలల శ్రమ దోపిడీ చాలా వరకు నివారించబడింది.

### 4. మత స్వేచ్ఛ (అధికరణం 25-28)

భారత రాజ్యాంగం 25 నుండి 28 వరకు అధికరణాల్లో మత స్వేచ్ఛ హక్కుకు హామీ ఇస్తుంది.

**మత స్వేచ్ఛ హక్కులు :**

- ఎవరికి ఇష్టం వచ్చిన మతాన్ని వారు ఆచరించడం, ప్రచారం చేసుకునే హక్కు.
- ఏదైనా మతం వ్యాప్తి కోసం లేదా ఎదుగుదల కోసం బలవంతపు పన్ను వసూళ్ళ నుండి స్వేచ్ఛ.
- ఏదైనా విద్యా సంస్థల్లో మతపరమైన బోధనలు లేదా ప్రార్థనల్లో పాల్గొనకుండా స్వేచ్ఛ.

మత స్వేచ్ఛ ఏ దేశంలో అయినా ప్రజాస్వామ్యానికి గీటురాయి. చరిత్రలో ప్రజాస్వామ్యానికి పూర్వం రాజుల కాలంలో రాజులు తమ మతాన్ని ప్రజలందరూ పాటించాలని నిర్బంధించేవారు. ఇతర మతస్థులను హింసకు గురి చేసేవారు. అంతేకాక, ఇతర మతస్థులనుండి బలవంతపు పన్ను వసూలు చేసేవారు. ఇలాంటి నిర్బంధాలు ఏవీ లేకుండా ఎవరి మతాన్ని వారు ఆచరించుకునే స్వేచ్ఛ వుండడమే ప్రజాస్వామ్యం. మన రాజ్యాంగం ఈ అధికరణాల్లో ఈ హామీని కల్పిస్తుంది.

**ఏ మతాన్నైనా నమ్మడం, ఆచరించడం :** భారతదేశంలో ఎవరికైనా తనకిష్టమైన మతాన్ని ఎంచుకునే హక్కువుంది. మతాన్ని ఎంచుకునే హక్కు వుండడం అంటే ఏ మతాన్ని కూడా ఎంచుకోకుండా వుండే హక్కు కూడా వుంది. అదేవిధంగా మతాన్ని నమ్ముకునే స్వేచ్ఛలో ఆ మతాన్ని ఆచరించడం, ప్రచారం చేసుకోవడం కూడా హక్కు. అయితే మత స్వేచ్ఛపై కొన్ని సహేతుకమైన నియంత్రణలు చేయవచ్చు. శాంతి

భద్రతలు, నీతి నియమాలు, ఆరోగ్యం తదితర కారణాల క్రింద మత స్వేచ్ఛను నియంత్రించవచ్చు. అదేవిధంగా సామాజిక దుష్పరిణామాలు కలిగించేవి మరియు దుష్ట ఆచారాలు నియంత్రించే అధికారం ప్రభుత్వానికి వుంటుంది. ఉదాహరణకు నరబలి, సతీసహగమనం, బహు భార్యాత్వం లాంటి ఆచారాలను నిషేధించే అధికారం ప్రభుత్వానికి వుంటుంది. ఇటువంటి నిషేధం మత స్వేచ్ఛను భంగపరచినట్లు కాదు. కొన్ని సందర్భాల్లో మత కార్యక్రమాలు ప్రజాశాంతికి భంగం కలిగిస్తున్నట్లయితే అటువంటి కార్యక్రమాలను ప్రభుత్వం నియంత్రించవచ్చు. అదేవిధంగా అందరూ తమ తమ మతాలను ప్రచారం చేసుకుని ఇతరులను తమ మతంలో చేర్చుకోవచ్చు. కానీ ఈ మత మార్పిడులు స్వచ్ఛందంగానే జరగాలి. బలవంతపు మత మార్పిడులు రాజ్యాంగ విరుద్ధం.

**అన్ని మతాల సమానత్వం :** భారతదేశం ప్రజాస్వామ్య దేశం. ఎన్నో మతాలకు నిలయమైన దేశం. ప్రభుత్వం తన విధానాలలో అన్ని మతాలను సమానంగా చూడాలి. అంటే ఏ మతానికీ ప్రత్యేక లేక అదనపు సౌకర్యాలు ప్రభుత్వం నుండి వుండకూడదు. ప్రభుత్వానికి అధికారిక మతం అంటూ ఏదీలేదు. అంటే ప్రభుత్వ ఉద్యోగాల్లో లేదా ప్రభుత్వ హోదాలయిన రాష్ట్రపతి, ప్రధాన మంత్రి, న్యాయమూర్తులు తదితర హోదాలకు ఏ మతానికి చెందినవారైనా అర్హులే. అదే విధంగా ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలు ఏ మతాన్ని బోధించవు, లేదా ఆచరించవు. ఏ మతానికి చెందినవారికీ ప్రత్యేక రాయితీలు వుండవు. ఆ విధంగా ఈ అధికరణాలు భారతదేశంలో లౌకిక వాదాన్ని నెలకొల్పుతున్నాయి.

## 5. సాంస్కృతిక మరియు విద్యా హక్కులు (అధికరణం 29-30)

- అల్పసంఖ్యాక వర్గాల భాషా సంస్కృతి రక్షణ
- అల్పసంఖ్యాకులు తమ భాషా సంస్కృతులను రక్షించుకునేందుకు విద్యా సంస్థలు నెలకొల్పుకునే హక్కు.

భారతదేశం ఎంతో వైవిధ్యమైన దేశం. ఈ దేశంలో వివిధ భాషలు, సంస్కృతులు కలవారు వున్నారు. ఈ సముదాయాల్లో కొంతమంది సంఖ్యాపరంగా చాలా అల్పమైన

సంఖ్యలో వుంటారు. ఇటువంటి అల్పసంఖ్యాక భాషా సంస్కృతి కలవారు తమ భాషా సంస్కృతిని వదులుకుని, అధిక సంఖ్యాకుల భాషా సంస్కృతులను ఆచరించాల్సిన అవసరంలేదు. తమతమ భాషా సంస్కృతుల్ని రక్షించుకుని పెంపొందించుకునే హక్కును రాజ్యాంగంలో ఈ అధికరణాలు అల్పసంఖ్యాకులకు ప్రాథమిక హక్కుగా కల్పిస్తున్నది. అల్పసంఖ్యాకులు అనగానే మతపరమైన అల్ప సంఖ్యాకులు మాత్రమే కాదు, భాషాపరమైన, సంస్కృతిపరమైన అల్పసంఖ్యాకులు కూడా వుంటారు. కొంతమందికి వారి భాషా, లిపి విభిన్నంగా వుంటుంది. ఇటువంటి వారందరూ తమ భాషా సంస్కృతికి తగ్గ విద్యా సంస్థలను నెలకొల్పుకుని వారి వారి భాషా లిపిని రక్షించుకోవచ్చు. ప్రభుత్వం విద్యా సంస్థలకు నిధులు ఇచ్చేటప్పుడు ఇటువంటి విద్యా సంస్థలకు కూడా ఇతర విద్యా సంస్థలతో సమానంగా మంజూరు చేయాలి. మైనారిటీ విద్యాసంస్థల పట్ల వివక్ష చూపకూడదు.

## 6. ప్రాథమిక హక్కుల ఉల్లంఘనలపై కోర్టు నుండి రిట్‌లు పొందే హక్కు : (అధికరణం 32)

భారత రాజ్యాంగం ముఖ్యమైన మానవ హక్కులను అన్నింటినీ మూడవ భాగంలో ప్రాథమిక హక్కులుగా రూపొందించింది. హక్కులు కల్పించినంత మాత్రాన ఉపయోగం లేదు. హక్కులు ఉల్లంఘన జరిగినప్పుడు తక్షణ నివారణ చేయగలిగినపుడే ఆ హక్కులు సార్థకమవుతాయి. అటువంటి నివారణ కూడా ఒక ప్రాథమిక హక్కుగా అధికరణం 32 కల్పిస్తుంది. భారత రాజ్యాంగం మొత్తానికి ఈ అధికరణం ఆత్మవంటిదని రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్. అంబేద్కర్ అన్నారు. ప్రాథమిక హక్కులు ఉల్లంఘించబడినపుడు ఏ పౌరుడైనా నేరుగా సుప్రీంకోర్టును లేదా హైకోర్టును ఆశ్రయించి తనకు జరిగిన ఉల్లంఘనలను నివారించుకోవచ్చు. నేరుగా సుప్రీంకోర్టుకు వెళ్ళే ప్రాథమిక హక్కు వున్నా, సాధారణంగా ఎవరైనా ముందు హైకోర్టుకు వెళ్ళి అక్కడ తగు ఉత్తర్వులు రాకపోతే అప్పుడు సుప్రీంకోర్టుకు వెళ్ళతారు. ఆ విధంగా రెండు అవకాశాలు వినియోగించుకోవచ్చు.

**రిట్స్ :** ప్రాథమిక హక్కులు ఉల్లంఘించబడినపుడు పౌరునికి హైకోర్టు లేదా సుప్రీంకోర్టు ఇచ్చే నివారణా వుత్తర్వులను రిట్స్ అంటారు. ఈ పదం లాటిన్ భాషలోనిది. ఈ రిట్స్ 5 రకాలు:

❖ **హెబియస్ కార్పస్ :** ఎవరైనా వ్యక్తిని నిర్బంధించినపుడు ఆ వ్యక్తికి సంబంధించినవారు హైకోర్టు లేదా సుప్రీంకోర్టుకు వెళ్ళి ఆ నిర్బంధాన్ని సవాల్ చేయవచ్చు. అప్పుడు ఆ నిర్బంధం అక్రమమయితే లేదా చట్ట వ్యతిరేకమయినదయితే ఆ నిర్బంధించబడిన వ్యక్తిని భౌతికంగా కోర్టు ఎదుట హాజరు పర్చమని ఆదేశించి, ఆ నిర్బంధం సక్రమంకానిదయితే ఆ వ్యక్తిని విడుదల చేసే ఉత్తర్వులు ఇస్తారు. అలా ఒక వ్యక్తిని భౌతికంగా హాజరు పర్చమని, అతని నిర్బంధం సక్రమమా, కాదా అని పరిశీలించే ఉత్తర్వులను హెబియస్ కార్పస్ అంటారు.

❖ **మాండమస్ :** ఏదైనా ప్రభుత్వ అధికారి తను నిర్వర్తించాల్సిన విధులను నిర్వర్తించకుండా తద్వారా పౌరుల ప్రాథమిక హక్కును ఉల్లంఘిస్తే హైకోర్టు లేదా సుప్రీంకోర్టు ఇచ్చే ఉత్తర్వులను మాండమస్ రిట్ అంటారు. ఆ ఉత్తర్వులలో కోర్టు సదరు ప్రభుత్వ అధికారిని తన విధులు నిర్వర్తించమని ఆదేశిస్తుంది.

❖ **ప్రొహిబిషన్ :** ఏదైనా కింద కోర్టులు తమ అధికార పరిధిలో లేని విచారణ లేదా ఇతర అధికారాలు వినియోగిస్తే దానిని నియంత్రించి, సరిచేసేందుకు హైకోర్టు ఇచ్చే ఉత్తర్వులను ప్రొహిబిషన్ రిట్ అంటారు.

❖ **కో వారెంటో :** ఎవరైనా వ్యక్తి ఏదైనా ప్రభుత్వ లేదా ప్రజా సంస్థకు సంబంధించిన పదవిలో అక్రమ పద్ధతిలో ఆక్రమించడం లేదా కొనసాగుతుంటే, ఆ పదవికి అతను చట్టబద్ధంగా అర్హుడా కాదా తేల్చి తగు ఉత్తర్వులు ఇవ్వవచ్చు. ఈ ఉత్తర్వులను కో వారెంటో రిట్ అంటారు.

❖ **సెర్షియోరేరి :** కింది కోర్టు లేదా ఇతర విచారణ అధికారులు పొరపాటుగా వ్యవహరిస్తుంటే దాన్ని సవరించేందుకు ఇచ్చే ఉత్తర్వులను సెర్షియోరేరి రిట్ అంటారు.

### హక్కులు కాపాడేందుకు ఇతర సంస్థలు :

హక్కులు ఉల్లంఘించబడినపుడు నివారించుకునేందుకు కోర్టులే కాక ఇతర సంస్థలు కొన్ని నెలకొల్పబడ్డాయి. వాటిలో ముఖ్యమైనవి.

- మైనారిటీ కమీషన్
- మహిళా కమీషన్
- షెడ్యూల్డు కులాల, తెగల కమీషన్
- మానవ హక్కుల కమీషన్

### ప్రాథమిక హక్కులు పౌరులకేనా లేక విదేశీయులకు కూడా వుంటాయా?

ప్రాథమిక హక్కులు కొన్ని భారతదేశ పౌరులకు మాత్రమే వర్తిస్తాయి. భారతదేశంలో నివసిస్తున్న లేదా సందర్శనకు వచ్చిన ఇతర దేశ పౌరులకు వర్తించవు. ప్రాథమిక హక్కుల్లో కొన్ని భారతదేశ పౌరులకే కాక ఏ దేశ పౌరులకైనా వర్తిస్తాయి.

### భారతీయులకు మాత్రమే వర్తించే ప్రాథమిక హక్కులు :

- కులం, మతం, జాతి, పుట్టిన ప్రాంతం ఆధారంగా వివక్ష వుండకూడదు అనే హక్కు. ఈ హక్కు ఇతర దేశస్తులకు వర్తించదు.
- ప్రభుత్వ ఉద్యోగాల్లో సమాన అవకాశాలు
- భావప్రకటనా స్వేచ్ఛ, యూనియన్లు పెట్టుకునే స్వేచ్ఛ, వృత్తి స్వేచ్ఛ, భారతదేశంలో స్థిర నివాసం ఏర్పర్చుకునే స్వేచ్ఛ, ఈ స్వేచ్ఛలు భారతీయులకు మాత్రమే వర్తిస్తాయి.
- భాష, లిపి, సంస్కృతులను రక్షించుకుని పెంపొందించుకునే హక్కు. ఇది భారతీయులకు మాత్రమే వుంటుంది.
- విద్యా సంస్థలను ఏర్పర్చుకుని నడుపుకునే అల్ప సంఖ్యాకుల హక్కు కూడా భారతీయులకు మాత్రమే వుంటుంది.

భారతీయులు, విదేశీయులు, ఇతర దేశాలకు సంబంధించిన సందర్శకులు అందరికీ వర్తించే హక్కులు :

- అధికరణం 14 (సమానత్వపు హక్కు)
- అధికరణం 20 (నిందితుని హక్కులు)
- అధికరణం 21 (జీవించే స్వేచ్ఛ)
- అధికరణం 22 (అరెస్టుకు సంబంధించిన హక్కులు)

## భాగం IV ఆదేశిక సూత్రాలు – అధికరణం 36-51

రాజ్యాంగంలో ప్రాథమిక హక్కుల తర్వాత ప్రధానమైన భాగం 4వ భాగం. ఇందులో ఆదేశిక సూత్రాలున్నాయి. ఈ ఆదేశిక సూత్రాలు ప్రభుత్వ విధానాలు ఎలా వుండాలి, ప్రజల సంక్షేమం కోసం ఏం చేయాలి, ప్రభుత్వ లక్ష్యాలు ఎలా వుండాలి, అనే అంశాలు నిర్దేశిస్తుంది. ఆదేశిక సూత్రాలు ప్రభుత్వాలు నడిపేదానికి మార్గదర్శకాలు. ఇందులో కూడా ప్రజలు పొందాల్సిన హక్కులు ఎన్నో వున్నాయి. ప్రాథమిక హక్కులకు, ఆదేశిక సూత్రాలకు ఒకే ఒక్క తేడా వుంది. ప్రాథమిక హక్కులు ఉల్లంఘించబడినప్పుడు కోర్టుల ద్వారా అమలు పర్చుకోవచ్చు. కానీ ఆదేశిక సూత్రాలను అమలు పర్చమని కోర్టులకు వెళ్ళడానికి లేదు. కోర్టుల్లో సవాలు చేయకపోయినా, ఆదేశిక సూత్రాల ప్రకారంగా ప్రభుత్వాన్ని నడపడం ప్రభుత్వాల నైతిక బాధ్యత.

## ఆదేశిక సూత్రాల అధ్యాయంలో 3 అంశాలున్నాయి :

- మొత్తం సమాజాన్ని ఏ లక్ష్యాల వైపు నడపాలి, ఎటువంటి ఉద్దేశాలు వుండాలి.
- ప్రాథమిక హక్కులు కాక ప్రజలకు కల్పించాల్సిన ఇతర హక్కులు
- ప్రభుత్వం అనుసరించాల్సిన విధానాలు

ప్రభుత్వాలు ఆదేశిక సూత్రాలను అమలుపర్చి అందుకు అనుగుణంగా ప్రజల సంక్షేమం కోసం కృషి చేశాయి. జమిందారీ విధానం రద్దు చేయడం, భూసంస్కరణలను అమలు చేయడం, పరిశ్రమల చట్టాల్ని రూపొందించడం. కనీస వేతనాలను అమలు

చేయడం, బ్యాంకుల జాతీయీకరణ, షెడ్యూల్డు కులాల రిజర్వేషన్లు, పంచాయితీ రాజ్ ఏర్పాటు, మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం, మధ్యాహ్న భోజనం లాంటి కార్యాక్రమాలన్నీ ఆదేశిక సూత్రాల అమలు కోసం చేసినవి.

## ఆదేశిక సూత్రాలు

**అధికరణం 38 :** (a) ప్రజా సంక్షేమానికి తగ్గట్టుగా సామాజిక వ్యవస్థను నెలకొల్పాలి.

**అధికరణం 39 :** (b) మహిళలు, పురుషులు అందరికీ సరైన ఉపాధి కల్పించాలి.

(c) సామాజిక మరియు ప్రకృతి వనరులు అందరి ఉపయోగార్థం పంపకం జరగాలి.

(d) ఆర్థిక వ్యవస్థ, జన బాహుళ్యానికి నష్టం కలిగించే విధంగా కొంత మంది గుప్పిట్లోకి సంపద చేకూర్చే విధంగా వుండకుండా చూసుకోవాలి.

(e) స్త్రీ, పురుషులకు సమాన పనికి సమాన వేతనం అందేట్టు వుండాలి

(f) స్త్రీ, పురుషులు, బాలలు పని దోపిడీ ద్వారా వారు అనారోగ్యానికి గురికాకుండా చూడాలి. బాలలు ఆరోగ్యకరంగా, స్వేచ్ఛ, గౌరవంగా బాల్యాన్ని, యవ్వనాన్ని అనుభవించి పెరిగే విధంగా సమాజాన్ని తీర్చిదిద్దాలి. వారిని దోపిడీకి గురికాకుండా అనైతిక కార్యక్రమాల్లో చిక్కుకోకుండా కాపాడాలి.

**అధికరణం 39** A : అందరికీ సమాన న్యాయం, ఉచిత న్యాయ సహాయం అందించాలి.

**అధికరణం 40-51**

- గ్రామ పంచాయితీలు తదితర స్థానిక సంస్థల పాలనా వ్యవస్థను పటిష్టం చేయడం

- ఉపాధి, విద్య హక్కులను కల్పించడం
- పని ప్రాంతాల్లో కార్మికులకు సౌకర్యాలు, మహిళలకు ప్రసూతి రాయితీలు కల్పించడం
- కార్మికులకు గౌరవ ప్రద జీవన వేతనాలు
- పరిశ్రమల యాజమాన్యంలో కార్మికులకు స్థానం కల్పించడం
- ఉమ్మడి పౌరచట్టం
- పసి పిల్లల సంరక్షణ మరియు 6 సం॥లోపు పిల్లల విద్య
- షెడ్యూల్డు కులాల, తెగల, ఇతర బలహీనవర్గాల ఆర్థిక, విద్య వసతులను పెంపొందించడం.
- ప్రజల పోషకాహార స్థాయిని పెంపొందించడం, జీవన స్థాయిని పెంపొందించడం, ప్రజా ఆరోగ్య వ్యవస్థను పతిష్ఠ పర్చడం
- వ్యవసాయాన్ని, పశుపోషణను అభివృద్ధి చేయడం.
- జాతీయ ప్రాముఖ్యతగల స్మారక కట్టడాలను, ఇతర సంపదను కాపాడడం
- పరిపాలక వ్యవస్థ నుండి న్యాయ వ్యవస్థను వేరు చేయడం
- అంతర్జాతీయ శాంతిని, భద్రతను పెంపొందించడం

**భాగం IVA ప్రాథమిక విధులు – అధికరణం 51 A**

రాజ్యాంగంలో ప్రాథమిక విధులు 1976 వ సంవత్సరంలో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చబడ్డాయి. ఈ ప్రాథమిక విధులను ప్రజలు స్వచ్ఛందంగా ఆచరించాలి. ఇవి కోర్టుల ద్వారా అమలు పర్చేవి కావు. ప్రాథమిక విధులు మొత్తం పదకొండు.

- రాజ్యాంగాన్ని, దేశ వ్యవస్థల్ని గౌరవించి లోబడి వుండాలి.
- స్వాతంత్ర ఉద్యమ లక్ష్యాలను, స్ఫూర్తిని రక్షించాలి.
- దేశ సార్వభౌమత్వాన్ని, ఐక్యతను సమర్థించి రక్షించాలి.
- దేశాన్ని రక్షించాలి. అవసరమైతే దేశ రక్షణ కోసం సేవలందించాలి.

- వైవిద్యభరితమైన మన గొప్ప సంస్కృతిని కాపాడాలి.
- ప్రకృతి, వాతావరణాన్ని రక్షించి పెంపొందించాలి.
- శాస్త్రీయ దృక్పథాన్ని, మానవతని మరియు పరిశోధించే తత్వాన్ని పెంపొందించాలి.
- ప్రజా ఆస్తులను రక్షించాలి.
- వ్యక్తిగత, సామూహిక రంగాల్లో ప్రతిభను పెంపొందించాలి.
- తమ సంరక్షణలో వున్న 6 నుండి 14 సం॥ల లోపు వయస్సుగల బాలలకు విద్యావకాశాలు కల్పించాలి. (ఇది 2002లో చేర్చబడింది).

**ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు మధ్య సంబంధం :**

ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు రెండూ కలిపి పౌరుల సంపూర్ణ వికాసానికి దోహదపడతాయి. ప్రాథమిక హక్కులు ప్రజల స్వేచ్ఛలను నిర్వచించి ప్రభుత్వం ఆ స్వేచ్ఛలను హరించకుండా చూడాలని చెప్తుంది. ఆ విధంగా ప్రాథమిక హక్కులు ప్రభుత్వాలు ఏం చేయకూడదో చెప్తుంది. ఆదేశిక సూత్రాలు ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం ఏం చేయాలో సూచిస్తుంది. ప్రాథమిక హక్కులు, వ్యక్తుల స్వేచ్ఛను, హక్కులను రక్షిస్తాయి. కానీ ఆదేశిక సూత్రాలు మొత్తం సమాజం క్షేమాన్ని, వికాసాన్ని పెంపొందించేందుకు ఉద్దేశించబడింది. అయితే, ఆదేశిక సూత్రాలను అమలు చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నించినపుడు కొన్ని సందర్భాల్లో ప్రాథమిక హక్కుల ఉల్లంఘన జరిగిందని వివాదాలు వచ్చాయి. గతంలో జమీందారీ వ్యవస్థ రద్దు చేసినప్పుడు తర్వాత భూసంస్కరణలు అమలు చేసినపుడు ప్రాథమిక హక్కుల్లో ఒకటైన ఆస్తిహక్కు ఉల్లంఘించబడిందని సుప్రీంకోర్టులో ఎన్నో కేసులు వున్నాయి. ప్రజా బాహుళ్యానికి మేలు చేసే జమిందారీ రద్దు గొప్పదనీ, దానివల్ల కొంతమంది వ్యక్తులు ఆస్తిహక్కు పోయినా పర్వాలేదనీ ప్రభుత్వం వాదించింది. ఆస్థిహక్కు కోల్పోయినవారి తరపున ప్రాథమిక హక్కులు పవిత్రమైనవని, ఆదేశిక సూత్రాలు అమలు పర్చడం కోసం ప్రాథమిక హక్కుల్ని ఉల్లంఘించడం రాజ్యాంగ విరుద్దమని వాదించారు. ఈ తీవ్ర వాదోపవాదాల మధ్య ప్రభుత్వం కొన్ని ప్రాథమిక హక్కుల్ని హరించే రాజ్యాంగ సవరణలు కూడా చెల్లవనే వివాదం చాలాకాలం నడిచింది. ఇలా న్యాయ వివాదాల

నేపథ్యంలో 'కేశవానంద భారతి' అనే ప్రముఖమైన కేసు అన్ని వివాదాలకు జవాబుగా అంతిమ తీర్పునిచ్చింది. ఈ తీర్పు ప్రకారం పార్లమెంటు, రాజ్యాంగాన్ని సవరించవచ్చు కానీ రాజ్యాంగంలోని మౌలిక అంశాలను నిర్మాణాన్ని మార్చడానికి లేదు. అయితే మౌలిక అంశాలేవీ, మౌలిక నిర్మాణ మంటే ఏమిటి? అనేది స్పష్టంగా నిర్వచించడం వీలుకాదు.

**ఆస్తిహక్కు:** రాజ్యాంగం వచ్చినప్పటినుండి రెండు దశాబ్ధాలకు పైగా ఆస్తిహక్కు, రాజ్యాంగ సవరణ అధికారం అనే అంశాలపై వివాదాస్పదమైన కేసులు వచ్చాయి. ఆ కాలంలో ఆస్తిహక్కు, ప్రాథమిక హక్కుల్లో ఒకటిగా ఉండేది. (19(1) (f) మరియు 31 అధికరణాలు). కేశవనంద భారతి కేసు తర్వాత ఆస్తిహక్కు రాజ్యాంగ మౌలిక నిర్మాణంలో భాగం కాదనీ, దాన్ని సవరించవచ్చని తీర్పు వచ్చింది. తరువాత 1978లో 44వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆస్తిహక్కు ప్రాథమిక హక్కుల అధ్యాయాన్నుండి తొలగించబడి సాధారణ రాజ్యాంగ హక్కుగా మార్చబడింది (అధికరణం 300 A)

# పాలనా వ్యవస్థ - విధులు

## భాగం V కేంద్ర ప్రభుత్వం (అధికరణాలు 52 – 151)

ఈ భాగంలో భారత రాష్ట్రపతి, ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులు, లోక్‌సభ, రాజ్యసభ, ఆడిటర్ జనరల్, అటార్నీ జనరల్ తదితరుల నియామకాలు, అధికారాలు, విధులు గురించి చెప్పబడ్డాయి.

అధికరణం 52 నుండి 62 వరకు రాష్ట్రపతి ఎన్నిక, అర్హత, రాష్ట్రపతిని తొలగించే పద్ధతి వివరించబడింది. అధికరణం 63 నుండి 71 వరకు ఉపరాష్ట్రపతి ఎన్నిక, విధులు, అధికారాల గురించి చెప్పబడింది. అధికరణం 72 నుండి 74 వరకు రాష్ట్రపతి అధికారాలు వివరించారు. అధికరణం 74 ప్రకారం కేంద్ర మంత్రిమండలి ఇచ్చే సలహాల ప్రకారం రాష్ట్రపతి నడుచుకోవాలి. అదేవిధంగా అధికరణం 72 ప్రకారం నేరస్తులకు క్షమాభిక్ష పెట్టే అధికారం రాష్ట్రపతికి వుంటుంది. ఈ అధికారం కూడా కేంద్ర మంత్రిమండలి చేసే సిఫార్సుల ప్రకారమే రాష్ట్రపతి వ్యవహరించాలి.

అధికరణం 75 ప్రకారం ప్రధానమంత్రిని రాష్ట్రపతి నియమిస్తాడు. ప్రధానమంత్రి సూచన మేరకు, కేంద్ర మంత్రులను నియమిస్తారు.

అధికరణం 76 అటార్నీ జనరల్ నియామకం గురించి చెప్తుంది.

అధికరణం 77, 78 ప్రభుత్వ వ్యవహారాలు ఎలా నడపాలో వివరించబడింది.

అధికరణం 79 నుంచి 122 వరకు పార్లమెంటు, అంటే లోక్‌సభ మరియు రాజ్యసభ ఎలా ఏర్పాటు చేయాలి, వాటి సమావేశాలు, ఎంతకాలం సమావేశమవ్వాలి, సభాధ్యక్షుని నియామకం, వారి జీతాలు లాంటి వివరాలన్నీ పొందుపర్చబడ్డాయి. అధికరణం 123 రాష్ట్రపతికి ఆర్డినెన్స్‌లు జారీచేసే అధికారం కల్పిస్తుంది.

అధికరణాలు 124 నుండి 147 వరకు కేంద్రస్థాయిలో న్యాయవ్యవస్థ అనగా సుప్రీంకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నియామకం, వారి జీతాలు, మరియు

సుప్రీంకోర్టు అధికారాలు గురించి వివరించబడింది. అధికరణాలు 148 నుండి 151 వరకు కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ నియామకం, విధులు చెప్పబడ్డాయి.

**భాగం VI – రాష్ట్రాలలో ప్రభుత్వాలు – న్యాయ వ్యవస్థ (అధికరణాలు 152 – 237)**

కేంద్రస్థాయిలో భారత రాష్ట్రపతి, ప్రధానమంత్రి, మంత్రి మండలి, పార్లమెంటు, సుప్రీంకోర్టు ఏర్పాటు ప్రక్రియలాగే, రాష్ట్రాల్లో గవర్నర్, ముఖ్యమంత్రి, శాసన సభ, స్పీకర్, హైకోర్టు, జిల్లా కోర్టు తదితర వివరాలన్నీ 152 అధికరణం నుండి 237 వ అధికరణం వరకు వివరించబడ్డాయి.

**భాగం IX – పంచాయితీరాజ్ వ్యవస్థ (అధికరణాలు 238– 243)**

238– 243 వరకు వున్న అధికరణాల్లో పంచాయితీ వ్యవస్థ, గ్రామసభలు ఎలా ఏర్పాటు చేయాలి, వాటి విధులు, అధికారాలు తదితర అంశాలన్నీ చర్చించబడ్డాయి.

**భాగం IX A – మున్సిపాలిటీలు – (అధికరణాలు 243 P – 243 ZG వరకు)**

ఈ అధికరణాల్లో మున్సిపాలిటీ వ్యవస్థను ఎలా ఏర్పరచాలి, పరిధి, సభ్యుల అర్హతలు, అధికారాలు, బాధ్యతలు తదితర అంశాలన్నీ పొందుపర్చారు.

**భాగం X – షెడ్యూల్డు ప్రాంతాలు మరియు ఆదివాసీ ప్రాంతాలు – (అధికరణం 244 – 244 A వరకు)**

ఆదివాసీ ప్రాంతాలలో పరిపాలన ఎలా జరగాలి, అందుకు సంబంధించిన పద్ధతులు ఈ అధికరణాల్లో వివరించబడ్డాయి.

**భాగం XIV – ట్రిబ్యునళ్ళు – (అధికరణం 323 A – 323 B వరకు )**

ఈ అధికరణాల్లో పరిపాలనలో వచ్చే వివాదాల పరిష్కారానికై ట్రిబ్యునళ్ళ ఏర్పాటు, వాటి అధికారం, విధులు గురించి వివరించబడింది.

**భాగం XV – ఎన్నికల కమీషన్ – (అధికరణం 324 – 329 A)**

ఎన్నికల కమీషన్ ఏర్పాటు, ఎన్నికల కమీషన్‌లో ముగ్గురు సభ్యులు, ప్రధాన ఎన్నికల కమీషనర్ తదితర ఎన్నికలకు సంబంధించిన అంశాలు ఈ అధికరణాల్లో వున్నాయి.

**భాగం XVI – కొన్ని తరగతులకు చెందిన వారికి ప్రత్యేక ఏర్పాటు – (అధికరణం 330 – 342 వరకు)**

షెడ్యూల్డు కులాలు, తెగలు మరియు ఆంగ్లో ఇండియన్స్ సమూహాలకు పార్లమెంటు, అసెంబ్లీల్లో తగు ప్రాతినిధ్యం వుండాలనీ, వారికి సీట్లు రిజర్వు చేయడానికి సంబంధించిన వివరాలు ఈ అధికరణాల్లో పొందుపర్చారు. అదేవిధంగా షెడ్యూల్డు కులాలవారికి, వారి హక్కుల రక్షణకై జాతీయ స్థాయిలో ఒక కమీషన్ ఏర్పాటు, ఆ కమీషన్ పని విధానం గురించి కూడా ఈ అధికరణాల్లో వున్నది.

**భాగం XX – రాజ్యాంగ సవరణ – అధికరణం 368**

రాజ్యాంగాన్ని సవరించి మార్పులు, చేర్పులు చెయ్యాలంటే పాటించాల్సిన పద్ధతి గురించి ఈ అధికరణంలో వివరించారు.

రాజ్యాంగాన్ని సవరించాలంటే పార్లమెంటులోని రెండు సభల్లో 2/3 వంతు మెజారిటీ సభ్యులు ఆమోదించాలి. ఇదికాక, ఫెడరల్ వ్యవస్థకు సంబంధించిన సవరణలు చేయాలంటే పార్లమెంటు రెండు సభల్లో ఆమోదం పొందిన తరువాత దేశంలోని అన్ని రాష్ట్రాల్లో మెజారిటీ శాసన సభల్లో ఆమోదం పొందాలి. జనవరి 2021 నాటికి రాజ్యాంగం 104 సార్లు సవరణలకు గురయ్యింది. రాజ్యాంగ సవరణలకు సంబంధించి 1950 నుండి రెండు దశాబ్దాల న్యాయ వివాదాల తర్వాత సుప్రీంకోర్టు 'కేశవానంద భారతి' కేసులో ఇచ్చిన తీర్పు నేటికీ తుది తీర్పుగా భావించబడుతుంది. ఈ తీర్పు ప్రకారం పార్లమెంటుకు రాజ్యాంగాన్ని సవరించే అధికారం వుంటుంది, కానీ రాజ్యాంగ మౌలిక స్వభావాన్ని, మౌలిక నిర్మాణాన్ని మార్చడానికి లేదు.

**భాగం XXI – తాత్కాలిక, మార్పుకు సంబంధించిన – (అధికరణాలు 369 నుంచి 392 వరకు)**

రాష్ట్ర పరిధిలోని అధికారాలను తాత్కాలికంగా పార్లమెంటు ఎప్పుడు వినియోగించవచ్చు, జమ్మూ కాశ్మీర్ ప్రత్యేక హోదా, తదితర అంశాలు ఈ అధికరణాల్లో వున్నాయి. అదేవిధంగా కొన్ని ప్రత్యేక వసతులు కొన్ని రాష్ట్రాలకు కల్పించడం గురించి కూడా ఈ అధికరణాల్లో వుంది.

**ముగింపు :**

నేటికి రాజ్యాంగం అమల్లోకి వచ్చి 71 సంవత్సరాలు గడిచింది. భారత ప్రభుత్వం ప్రతి ఏటా నవంబరు 26న రాజ్యాంగ దినోత్సవంగా జరుపుకోవాలని నిర్ణయించింది. రాజ్యాంగ రచన Constituent Assembly లో జరిగింది. ఈ రాజ్యాంగాన్ని రచించడంలో డా. బి.ఆర్. అంబేద్కర్ ప్రధాన పాత్ర పోషించారు. ఎంతోమంది సభ్యులు రాజ్యాంగ రచనలో పాల్గొన్నారు. అందరి కృషి ఫలితంగా తయారైన రాజ్యాంగం నవంబరు 26, 1949న ఆమోదించబడింది. అయితే అది అమల్లోకి రావడం 26 జనవరి, 1950న జరిగింది. రాజ్యాంగం ప్రజాస్వామిక విలువల్ని, స్వతంత్ర న్యాయ వ్యవస్థని, ప్రాథమిక హక్కుల్ని అమల్లోకి తెచ్చింది. ఈ 71 సంవత్సరాల్లో ఎన్నోసార్లు రాజ్యాంగ ప్రకారంగా ఎన్నికలు జరిగాయి. మొత్తం మీద రాజ్యాంగం పటిష్టంగానే కొనసాగుతున్నా రాజకీయ అవినీతి కారణంగా చాలావరకు వ్యవస్థలు బలహీన పడుతున్నాయి. ప్రాథమిక హక్కులు ముఖ్యంగా సమానత్వ హక్కు అందరికీ చేరువకాలేదు. కుల అణచివేత, స్త్రీల అణచివేత వివిధ రూపాల్లో ఇంకా కొనసాగుతూనే వుంది. రాజ్యాంగం పొందుపర్చిన హక్కులు అందరూ అందుకోవాలంటే ప్రజా చైతన్యం పెరగడం మినహా వేరే దారిలేదు. దళిత స్త్రీలు, అట్టడుగు వర్గాలవారు రాజ్యాంగం గురించి పూర్తిగా తెలుసుకుని దాని అమలుకై కృషి చేయాలి. రాజ్యాంగం గురించి సంక్షిప్తంగా అయినా ఈ చిన్న పుస్తకం ద్వారా తెలుస్తుందని, వారిలో ఉత్సాహం వచ్చి రాజ్యాంగం గురించి మరింత లోతుగా అధ్యయనం చేస్తారని ఆశిస్తున్నాము.